

చూపు.. స్థానికం వైపు..

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలిచిన ఉత్సాహంతో ప్రభుత్వం దృష్టి

- స్థానిక ఎన్నికలు ప్రధాన ఎజెండాగా నేడు కేబినెట్ సమావేశం
- గత రిజర్వేషన్లను కోర్టులు కాదనడంతో విధానంపై సమాలోచన
- పార్టీపరంగా రిజర్వేషన్లను ఇచ్చి ముందుకెళ్లేందుకు చాన్స్
- ఇప్పటికే పాలకవర్గాలు లేకపోవడంతో నిధులు నిలిచి.. ఇబ్బందులు



మహబూబ్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు ముగిశాయి.. కానీ అంతకు ముందే జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి.. జూబ్లీహిల్స్‌లో



నవాబ్‌పేట గ్రామ పంచాయతీ కార్యాలయం

గెలిచిన ఊపుతో మళ్లీ స్థానికంపై కాంగ్రెస్ దృష్టి సారించాలని భావిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం సాయంత్రం కేబినెట్ సమావేశం జరగనుంది. గతంలో బీసీలకు 42 శాతం కేటాయించిన రిజర్వేషన్లు హైకోర్టు, సుప్రీం కోర్టులు చెల్లవని చెప్పాయి. అయితే 50 శాతంలోపు రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించుకోవచ్చని సూచించింది. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ ఎన్నికలు రావడం, ప్రభుత్వం అందులో బిజీగా మారడంతో స్థానిక ఎన్నికల విషయం మరుగునపడింది. మధ్యలో ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని హైకోర్టు అడుగగా, ప్రభుత్వం గడువు కోరింది. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఎన్నికలు పూర్తి కావడంతో ఇక ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానిక ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలతోపాటు సర్పంచు స్థానాలకు రాష్ట్ర ఎన్నికల సంఘం రీషెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ ఇప్పటికీ రిజర్వేషన్ల విషయంలో స్పష్టత రాలేదు. ఢిల్లీలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సి వచ్చే అంశంపై ఆమోదం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని కేబినెట్‌లో ఉంచి స్థానిక ఎన్నికలకు ఎలా వెళ్లాలనేది నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు. అయితే బీసీ సంఘాలు మాత్రం బీసీలకు చట్టపరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేస్తున్నాయి. మరి ప్రభుత్వం ఏ విధంగా నిర్ణయం తీసుకుంటుందో నేడు జరిగే కేబినెట్ భేటీ తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఆ రిజర్వేషన్ల ప్రకారమే..

కోర్టులు సూచించిన విధంగా 50 శాతంలోపు రిజర్వేషన్లలో ఎన్నికలకు వెళ్లాల్సి వస్తే.. మళ్లీ రిజర్వేషన్లను ఖరారు చేస్తారా? లేక గత ఎన్నికల్లో చేసిన రిజర్వేషన్ల ప్రకారమే ముందుకు వెళ్తారా? అనేది తేలాల్సి ఉంటుంది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు వెళ్లే పక్షంలో జనరల్ స్థానాలు ఉన్నచోట్ల బీసీ అభ్యర్థులకు టికెట్లు ఇచ్చే అవకాశం ఉంటుంది. అలాగే పెద్ద కసరత్తు లేకుండానే త్వరితగతిన నోటిఫికేషన్ వచ్చి, ఎన్నికలు నిర్వహించడానికి వీలు ఏర్పడుతుంది. ఒకవేళ మళ్లీ రిజర్వేషన్లను ఖరారు చేయాలంటే చాలా సమయం పడుతుంది. ఇప్పటికే దాదాపు 20 నెలలుగా పంచాయతీలకు పాలకవర్గాలు లేవు. ఈ కారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు ఆగిపోయాయి. చెత్త సేకరణ నుంచి మొదలుకుని.. అభివృద్ధి పనుల వరకు

(మిగతా 6లో..)



నాయకులతో చికాకే..

బీసీ రిజర్వేషన్లు చట్టపరంగా ఆమోదం పొందని పక్షంలో పార్టీ పరంగా రిజర్వేషన్లు కేటాయించాలని కాంగ్రెస్ భావిస్తే.. నాయకులతో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు చిక్కులు ఏర్పడే అవకాశం ఉంది. చట్టపరంగా ఇస్తే తమకు అదృష్టం లేదని భావించి, బలంగా ఉన్న నాయకులైనా రిజర్వేషన్ల ప్రకారం నడుచుకోవాల్సిందే. కానీ పార్టీ పరంగా ఇస్తే బలంగా ఉన్న వారిలో వేరే వర్గానికి రిజర్వేషన్ ఎలా ఇస్తారని ఎమ్మెల్యేలతో కొట్లాడే అవకాశం ఉంటుంది. అలాగే పెద్ద గ్రామాల విషయంలో పార్టీ పరమైన రిజర్వేషన్లు గ్రౌండ్‌లో ఉన్న అభ్యర్థికి అనుకూలంగా రాకపోతే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అదే సమయంలో పార్టీ పరమైన రిజర్వేషన్లను మిగతా పార్టీలు కూడా అనుసరించాల్సిన పరిస్థితులు ఏర్పడనున్నాయి. ఒకవేళ అలా ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీ దాన్ని తమకు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉంది. గతంలో బీఆర్ఎస్ ఎక్కువ స్థానాలు గెలిచిన నేపథ్యంలో బలంగా ఉన్నవారంతా పాత రిజర్వేషన్ల ప్రకారం పోటీలో ఉన్నవారే. ఇప్పుడు ఆ స్థానాల్లో బీసీలకు కేటాయించాల్సి వస్తే సదరు బలమైన గ్రామ నాయకులు నిరుత్సాహపడే అవకాశం ఉంటుంది. అయితే బీసీలకు రిజర్వేషన్లు ఏ పద్ధతిలో ఇచ్చినా.. గ్రామీణ రాజకీయ ముఖచిత్రంపై కొత్త నాయకత్వం మాత్రం కనిపించే అవకాశాలు ఉంటాయి.

ఆధ్యాత్మికతకు నిలయం పాలమూరు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతకు నిలయం పాలమూరు అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నగరంలోని అప్పన్నపల్లి అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇలాంటి పారాయణ మహాయజ్ఞాలు ప్రజల్లో భక్తిని పెంపొందించడమే కాకుండా, సమాజ ఐక్యతకు దోహదం చేస్తాయన్నారు. ప్రతి కుటుంబం సుఖఃసంతోషాలు, ఆరోగ్యం, శాంతి, అభివృద్ధితో విరాజిల్లాలని అభయాంజనేయ స్వామిని కోరారు. 1,116 దంపతులు పారాయణంలో పాల్గొన్నారు. అప్పన్నపల్లి, ఏనుగొండ, హౌసింగ్ బోర్డు కాలనీల ప్రజలు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి గొనేల శ్రీనివాసులు, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, డీసీసీ కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో కార్పొరేట్‌కు దీటుగా వసతులు

- రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్
- కల్వకుర్తిలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న విద్యా కమిషన్ సభ్యుడు వెంకటేశ్

కల్వకుర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గురుకులాల్లో సౌకర్యాలు కల్పిస్తోందని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు డాక్టర్ చారకొండ వెంకటేశ్ అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను రాణించాలని ఆయన సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని ఎంజేపీ బీసీ బాలికల గురుకుల పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడాపోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగే ఈ క్రీడలను రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు డాక్టర్ చారకొండ వెంకటేశ్, స్థానిక ఎంజేపీ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమణిలు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 16 బీసీ బాలికల గురుకులాల నుంచి 500 మంది విద్యార్థినులు

(మిగతా 6లో..)

వేతన వెతలు

- గోపాల మిత్రలకు 8 నెలలుగా అందని వేతనాలు
- కుటుంబ పోషణకు ఇబ్బందులు
- నారాయణపేట జిల్లాలో 40 మంది సేవలు



కొత్తపల్లి మండలం హన్మన్‌పల్లిలో ఎద్దుకు టీకా వేస్తున్న గోపాలమిత్ర

కొత్తపల్లి, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి): పశుసంవర్థక శాఖలో దీర్ఘకాలికంగా వివిధ రకల సేవలందిస్తున్న గోపాల మిత్రుల పరిస్థితి దయానీయంగా మారింది. ప్రభుత్వ సిబ్బందితో సమానంగా పని చేస్తున్నప టికీ ఉద్యోగ భద్రత కరువైంది. ఇచ్చేది అరకొర వేతనలే అయినా, అవికూడా 8 నెలలుగా ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. దాంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. నారాయణపేట జిల్లాలో 40 మంది గోపాలమిత్రలు పని చేస్తున్నారు.

సేవలు ఇలా..

గోపాల మిత్రలు రైతుల ఇళ్లకు వెళ్లి పశువులకు కృత్రిమ గర్భధారణ టీకాలు వేయాల్సి ఉంటుంది. దాంతో పాటు నట్టల నివారణకు మందులు వేయడం, గర్భకోశ వ్యాధులు, జబ్బ, గొంతు వాపు నివారణ టీకాలు వేయాల్సి ఉంది. అలాగే పశుసంపద అభివృద్ధి, సంకర జాతి గేదెల ఉత్పత్తి, పాడి అభివృద్ధి, పశుగ్రాసంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో హెల్త్ డీ వార్మింగ్ క్యాంపులు నిర్వహిస్తూ టీకాలు, నట్టల మందులు వేస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గోపాల మిత్రులకు భద్రత కరువైంది. వారిని క్రమబద్ధీకరించ లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వేతనం రూ.3,500 నుంచి రూ.8,500లకు, 2022లో రూ.11,500లకు వేతనం పెంచారు. ఇంత వరకు బాగున్నా.. 8 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జీతాలు ప్రతీనెల అందేలా చూడాలి



మూగ జీవాలకు సేవలందిస్తున్న గోపాల మిత్రలకు ప్రతీ నెల 1వ తేదీన వేతనం వచ్చేలా చూడాలి. నిత్యం గ్రామాలు తిరిగి, రైతులకు సేవలు అందిస్తున్న వారి ఉద్యోగాలకు ప్రభుత్వం భద్రత కల్పించాలి. వేతనాలు పెంచాలి.

మాషప్ప, గోపాల మిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు, నారాయణపేట

ఆర్థిక ఇబ్బందులతో సతమతం



మాకు 8 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. వేతనాలు నెలనెల రాకపోవడంతో దుర్భర జీవితాలు గడుపుతున్నాం. దాంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. అధికారులు స్పందించి ప్రతీ నెల జీతాలు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మల్లేష్ యాదవ్, గోపాలమిత్ర



రెడ్డిపల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లూ చేయాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్
- గండీడ్ మండలం రెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

గండీడ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని రెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి, మాట్లాడారు. రైతులు తాము కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని ఆరబెట్టుకొని తీసుకురావాలన్నారు. అనంతరం వెన్నచేడులో గల షెడ్యూలు కులాల బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి, అక్కడ వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.

గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్లొద్దు

- 'పేట' ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల సొమ్మును దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు వారి బలహీనతలను పెట్టుబడిగా చేసుకుంటున్నారని నారాయణపేట ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న గొలుసు కట్టు వ్యాపారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మీ కింద ఎక్కువ మంది ఏజెంట్లను చేర్పించి, తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి అనే ప్రచారాలను నమ్మొద్దని చెప్పారు. ఇలాంటి మల్టీలెవెల్ వ్యాపారం చేస్తూ, ప్రజల నుంచి డబ్బులు సేకరించి ఆర్థికంగా మోసం చేస్తున్నారన్నారు. ఇలాంటి వారి మాయమాటలు నమ్మి అత్యాశకు పోతే భారీగా ఆర్థిక నష్టం జరుగుతుందని అన్నారు. వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు చేసి, అమాయకులను ఆకర్శించి మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. ఇలాంటి నెట్‌వర్క్‌లో ఎవరూ చేరొద్దన్నారు. అనుమానాస్పద ప్రకటనలు, వెబ్ లింకులు, ఏపీకే ఫైల్స్ వంటివి డౌన్‌లోడ్ చేయొద్దని, మోసపూరిత ప్రకటనలపై, ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ తెలిపారు.



కురుమూర్తి స్వామి ఆలయ ప్రాంగణంలో జపాన్‌కు చెందిన నగోయా అసోసియేషన్ సభ్యులతో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 130.00
హోల్ సేల్	: 139.00
డ్రెస్డ్	: 234.00
స్కిన్ లెస్	: 251.00

సంఘ వ్యతిరేకుల సమాచారం ఇవ్వండి

- డీఎస్పీ వెంకటేశ్వర్లు
- నగరంలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ నగర్‌లలో కమ్యూనిటీ కాంటాక్ట్

మహబూబ్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాలనీలలో సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నా, మీ దృష్టికి అలాంటి సమాచారం ఉన్నా పోలీసుల దృష్టికి తేవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు చెప్పారు. అనుమానాస్పద కదలికలు, కొత్త వ్యక్తులు కనిపిస్తే సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆదివారం ఉదయం మహబూబ్‌నగర్ టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ నగర్, జగ్జీవన్‌రామ్ నగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. పోలీసులు అధిక సంఖ్యలో కాలనీలోని అన్ని ఇళ్లను తనిఖీ చేశారు. ఇళ్ళల్లో నివాసం ఉంటున్న వారి వివరాలు, వాహనాల ధ్రువీకరణపత్రాలు, ఆధార్ కార్డులను పరిశీలించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 3 ఆటోలు, 17 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత పత్రాలు తెస్తేనే వాహనాలను ఇస్తామని చెప్పారు. ఈ సందర్భంగా



ఓ ఇంటి వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు శాంతిభద్రతలు అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని, వారికి సహకరించాలని కోరారు. దొంగతనాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఇంటికి తాళం వేసి వెళ్ళినపుడు ఇంట్లో విలువైన వస్తువులు ఉంచరాదని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి ఓటీపీ, పిన్ నెంబర్ అడిగితే చెప్పొద్దన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దన్నారు. ఇళ్లను అద్దెకు తీసుకుని అసాంఘిక చర్యలకు పాల్పడే ప్రమాదం ఉన్నందున వారి వివరాలు, ఆధార్‌కార్డులు తీసుకోవాలని చెప్పారు. మోటార్ వాహన చట్టం నిబంధనలను వివరించారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, హెల్మెట్ విధిగా ధరించాలని వెల్లడించారు. 150 ఇళ్ళల్లో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్, ఎస్ఐ విజయభాస్కర్ పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో పాల్గొన్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్లలో సామాజిక న్యాయ ధర్మదీక్ష

జడ్చర్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి డిక్లరేషన్‌తో పాటు బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని జడ్చర్ల పట్టణంలో ఆదివారం బీసీ జాగృతిసేన, బీసీ జేఏసీ, బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సిగ్నల్‌గడ్డ ధర్నా చౌక్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ దీక్షా శిబిరానికి వచ్చి మద్దతిచ్చారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ చట్టబద్దతతో కూడిన 42 శాతం రిజర్వేషన్ అమలు విషయమై ముఖ్యమంత్రితో మాట్లాడుతానన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో చట్టబద్దతతో కూడిన 42శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ అన్నారు. బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్, బీసీ జేఏసీ నాయకులు పిట్టల మురళి, ప్రణీల్‌చందర్, శ్రీకాంత్, కౌన్సిలర్ ఉమాశంకర్‌గౌడ్, నడిమింటి శ్రీనివాస్, చింతోజ్ రఘునందన చారి, వెంకటేష్ మాట్లాడారు. కార్యక్రమంలో రఘునందన్‌చారి, వెంకటేష్, నిరంజన్, గొడుగు నరసింహులు, లింగంపేట శేఖర్, మాచారం శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, శివరాములు, వెంకటేష్, గోపాల్ పాల్గొన్నారు.

పద్మశాలీలు ఉన్నత స్థాయికి చేరాలి

● ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో పద్మశాలీలు

పాలమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలి విద్యార్థిని, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లా కెంచె సుభాష్‌చంద్ర ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రం లోని అయ్యప్పకొండపై శివ మార్కండేయ ఆలయంలో పద్మశాలి విద్యార్థు లకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, నీట్, ఐఐటీ అత్యధిక మార్కులు సాధించిన బాల బాలికలకు ప్రతిభా పురస్కారాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్ర మంలో బాలరాజు, మల్లికార్జునరావు, బాలకృష్ణ, శ్రీనివాసులు, దివాకర్, సునిల్‌కుమార్, శ్రీనివాస్, ఆంజనేయులు, శ్యామ్, సుందర్, రఘురా ములు, సంతోషి, సూర్యనారాయణ, శ్రీపాదరావు, వెంకటస్వామి, కృష్ణకు మార్, ప్రభాకర్, కృష్ణయ్య, కరుణ, రామచంద్రయ్య, మహేష్, శ్రీరామ విజ యలక్ష్మి, సంయుక్త, వెంకటేష్, బాలరాజు, రాజశేఖర్, సత్యనారాయణ, శంకర్, శివమార్కండేయ పాల్గొన్నారు.

విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు

● జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

● ఇద్గాన్‌పల్లిలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం

● రూ.26 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

రాజాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విడతల వారీగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలం లోని ఇద్గాన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. అనం తరం రూ.26 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు మండల కేంద్రంలో పలు కాలనీల్లో సీసీరోడ్లు మంజూరు చేయాలని నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేయగా, స్పందించిన ఎమ్మెల్యే సీసీ రోడ్ల మంజూరుకు కృషి చేస్తా నని హామీ ఇచ్చారు. ఏఎంసీ వైస్ చైర్మన్ శేఖ ర్‌గౌడ్, డైరెక్టర్ పంచాక్షరి, శ్రీనివాస్‌నాయక్, శివకుమార్, ఎంపీడీవో లక్ష్మీదేవి, విక్రమ్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, విక్రం రెడ్డి, రమేష్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి అద్దం పత్రికా రంగం

జడ్చర్ల : ప్రజాస్వామ్యానికి అద్దం పట్టే వేదిక పత్రికారంగమని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో కొత్త ప్రెస్‌క్లబ్ అసోసియేషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర అత్యంత ముఖ్యమైనదన్నారు. నిజాలు ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు అపార మైన సేవలు అందిస్తున్నారని, వారి సంక్షేమా నికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



హద్దు రాయిని దాటి, కుంటలో సాగుచేసిన పంటలు

రేకుల కుంటలో సాగు చేసిన..

పంటలు తొలగించాలి

● ఇరిగేషన్ డీఈ ఆనంద్‌కిశోర్

కోస్గి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొలవోనిపల్లి శివారు లోని రేకులకుంటలో ప్రైవేటు వ్యక్తులు సాగు చేసిన పంటలు వారంలోగా ఖాళీ చేయాలని ఇరిగేషన్ డీఈ ఆనంద్‌కిశోర్ ఆదివారం తెలిపారు. మూడు రోజుల క్రితం పూర్తి స్థాయిలో హద్దులు నిర్ణయించామన్నారు. గతంలో హద్దులు పెడితే తొలగించారన్నారు. పూర్తి స్థాయిలో కుంట మొత్తం భూమి కంచె ఏర్పాటు చేసి కట్ట వేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపామని, నిధులు మంజూరు కాగానే కట్ట వేసి ఆక్రమణ జరగకుండా చేస్తామన్నారు. కుంటలో కంది, వరి, పెబ్బర్లు పంట సాగు చేశారన్నారు. వారంలోగా పంటలు తొలగించాలని చెప్పామని, సోమవారం నోటీసులు జారీ చేస్తామని అన్నారు. మరోమారు పంటలు వేస్తే కేసులు పెడతామన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

అబుల్ కలాంను

ఆదర్శంగా తీసుకోవాలి

● టీజీఎంఎఫ్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమర యోధుడు, బహుభాషా కోవిదుడు, విద్యారంగ అభివృద్ధికి పునాది వేసిన మౌలానా అబుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని ప్రతీ ఒక్కరూ సమాజ, దేశ అభివృద్ధికి అంకితభావంతో సేవలు అందించాలని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. టీ ఆల్‌మేవా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ అయూబ్, ఖాదర్ ఆధ్వర్యంలో దేశ మొదటి విద్యశాఖ మంత్రి జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆది వారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎం ఫంక్షన్ హాల్‌లో ఉత్తమ ఉద్యోగులకు సన్మాన కార్య క్రమం నిర్వహించగా ఒబేదుల్లా కొత్వాల్ హాజరై, అవార్డులు అందజేశారు. ఉద్యోగుల సమస్యలపై టీ.ఆల్‌మేవా పోరాటం అభినందనీయమని, ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసి అవార్డుల అందజేయడం సంతోషంగా ఉందన్నారు. టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ ఖలీల్, నాయకులు యూసుఫ్‌బిన్‌నాసర్, ము రళీ కృష్ణ, టీఆల్‌మేవా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మ హ్మద్ అయూబ్, అబ్దుల్‌ఖాదర్, ట్రెజర్ ఖాదర్, రాష్ట్ర ప్రతి నిధులు ముసా, దస్తగీర్, ఇస్మాయిల్, జావిద్, సిరాజుద్దీన్‌ఖాన్, ఖాజాజైనులాబుద్దీన్ పాల్గొన్నారు.

సమాజ హితమే పార్టీ ధ్యేయం

● సీపీఐ ఎమ్మెల్సీ సత్యం, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలనరసింహ



మక్తల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యం

మక్తల్‌రూరల్/మరికల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అట్టడుగున్న బలహీన వర్గాల హక్కులు, ఆకాంక్షలకు అనుగుణంగా కమ్యూనిస్టు పార్టీ పని చేస్తుందని, సమాజ హితమే కమ్యూనిస్టు పార్టీ ధ్యేయమని సీపీఐ ఎమ్మెల్సీ సత్యం, ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాల నరసింహ అన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్స వాల సందర్భంగా ఖమ్మంలో డిసెంబరు 26న నిర్వహించనున్న ఉత్సవాలకు సంబంధించిన ప్రచార జాత ఆదివారం మక్తల్ పట్టణానికి చేరుకోగా ఆ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆటపాటలతో అలరించి, కమ్యూనిస్టు పార్టీ పోరాటాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ సత్యంకు గొర్రెల కాపరులకు సంబంధించిన సమ స్యలపై వినతిపత్రం అందించారు. కార్య క్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నరసిం హులు, సహాయ కార్యదర్శి సంతోష్, విజ యరాములు తదితరులున్నారు. అదేవి ధంగా, మరికల్ మండల కేంద్రానికి చేరు కున్న సీపీఐ బస్సు జాతకు ఆ పార్టీ నాయకుడు పి.వెంకటేష్ ఘన స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ బీఆర్.అంబే డ్కర్ విగ్రహానికి పూలమాల వేసి గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఇందిరాగాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.బా లనర్సింహ మాట్లాడారు. కార్యక్రమంలో నరసింహులు, సంతోష్, విజయరాములు, వెంకటయ్య, అబ్రహం ఉన్నారు.

చూపు.. స్థానికం వైపు..

(5వ పేజీ తరువాయి)

ఇబ్బందులు తప్పడం లేదు. ఇంకా ఆలస్యం చేస్తే ఆర్థిక సంఘం నిధులు విడుదల అయ్యే పరిస్థితి ఉండదు. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉన్న నేపథ్యంలో పంచాయతీలకు నిధులు మళ్లి పోవడం భారంగా మారే అవకాశం ఉంది. దీంతోపాటు మునిసి పాలిటీ పాలకవర్గాలు గడువు తీరి, దాదాపు పది నెలలు పూర్త య్యింది. ఈ ఎన్నికలు పూర్తయితేనే మునిసిపాలిటీల ఎన్నికలు చేపట్టాల్సి ఉంటుంది. మునిసిపాలిటీలు ప్రత్యేక అధికారుల పాల నలో ఎక్కువ రోజులు నడిచే పరిస్థితులు లేవు. పరిషత్ స్థానాల నుంచి మొదలుకుని.. పంచాయతీలు, మునిసిపాలిటీలు, ఆ తర్వాత సహకార సంఘాలు ఇలా 2026 పూర్తిగా ఎన్నికల ప్రక్రి యలో గడిచిపోయే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని చెప్పవచ్చు. 2027 నుంచి జనగణన ప్రారంభమైతే.. ఎన్నికలు చేపట్టే అవ కాశం ఉండదు. 2028 వరకు జనగణన పూర్తిచేసి.. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన చేపట్టనున్నారు.

గురుకులాల్లో కార్పొరేట్‌కు దీటుగా వసతులు

(5వ పేజీ తరువాయి..)

ఈ పోటీలకు హాజరయ్యారు. అంతకు ముందు జరిగిన సమావేశంలో డాక్టర్ చారకొండ వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మౌలిక వసతులు కల్పిస్తోందని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి చదువుతోపాటు ఉద్యోగ అవకాశాల్లో రెండు శాతం రిజర్వేషన్లు పొందవచ్చని సూచించారు. మొదటి రోజు ఖోఖో పోటీల్లో కల్వకుర్తి వర్సెస్ పెబ్బేరు జట్లు తలపడగా కల్వకుర్తి జట్టు గెలిచింది. కబడ్డీలో పుల్లూరు వర్సెస్ న్యూవెల్దూరు తలపడగా పుల్లూరు జట్టు విజయం సాధించింది. వాలీబాల్‌లో కోటకొండ వర్సెస్ తాడూరు జట్లు పోటీ పడగా తాడూరు విజయం సాధించింది. టెన్నికాయిట్‌లో ఊర్కొండపేట వర్సెస్ కల్వకుర్తి జట్లు పోటీ పడగా కల్వకుర్తి గెలుపొందిం దని తెలిపారు. అథ్లెటిక్స్‌లో క్రీడాకారులు పోటీ పడుతున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమణి తెలిపారు. కార్యక్రమంలో పీడీ సింధూజ, పలువురు పీటీలు, పీడీలు, క్రీడాకారులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ ద్వారా

940 కేసులు పరిష్కారం

- నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిర్వహించిన స్పెషల్ లోక్ అదాలత్ ద్వారా 940 కేసులు పరిష్కారమ య్యాయని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ క్రైమ్ 54 కేసుల్లో 9లక్షలు రీఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేశారని ఎస్పీ తెలిపారు. ఈ 940 కేసుల్లో ఎఫ్ఐఆర్ కేసులు 201, పిటి కేసులు-328, డ్రంకెన్ డ్రైవ్ కేసులు-358, సైబర్ కేసులు-54 పరిష్కరించడం ద్వారా 8,98,186 రూపాయలు బాధితులకు అందజేశారని తెలిపారు. రాజీ మార్గం రాజా మార్గమని లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు న్యాయం జరుగుతుందని అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించారు. అదేవిధంగా లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాల ని సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయ సేవాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అలివి వలలను నిషేధించాలి

● సీపీఎం పెంట్లవెల్లి మండల కార్యదర్శి కురుమయ్య

పెంట్లవెల్లి నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోలు గ్రామాల కృష్ణానది తీరంలో అలివి వలలు నిషేధించాలని సీపీఎం మండల కార్యదర్శి కురుమయ్య ఒక ప్రకటనలో కోరారు. కృష్ణా నదిలో నిషేధిత వలల ద్వారా చిన్న చేపలు పట్టే స్థానిక మత్స్యకారులకు ఉపాధి లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కొవ్వూరు, రాజమండ్రి ప్రాంతాల నుంచి జాలర్లను పిలిపించి అలివి వల ల ద్వారా చిన్న చేపలు పట్టి ఇతర ప్రాంతాలకు విక్రయిస్తున్నారని పేర్కొ న్నారు. అధికారులు చొరవ చూపి కృష్ణానది తీరం వెంబడి ఉన్న అలివి వలలను నిషేధించాలని అన్నారు.

ఉమ్రా యాత్రికులకు సన్మానం

కొత్తకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ముగ్గురు మైనార్టీలు ఉమ్రా యాత్రకు వెళ్తున్న సందర్భంగా పట్టణ మైనార్టీ సం ఘం నాయకులు ఆదివారం సన్మానం చేశారు. జామే మసీదులో ప్రత్యేక ప్రార్థన అ నంతరం యాత్రికులు మజీద్, మేరాజ్, జీశా న్‌లను శాలువా, పూలమాలతో సన్మానం చేశారు. సన్మానం చేసిన వారిలో మైనార్టీ పట్టణ సంఘం అధ్యక్షులు లతీఫ్ ప్రధాన కార్యదర్శి సుల్తాన్, గౌరవ సలహాదా రు సలీంఖాన్, జావెద్‌అలీ, తయ్యుబ్, అజీఎ, రషీద్‌బాబా, తదితరులు ఉన్నారు.

బొలెరో అదుపు తప్పి బోల్తా

- 15 మంది పెద్దలు, 5గురు చిన్నారులకు గాయాలు
- వారిలో రెండేళ్ల చిన్నారి పరిస్థితి విషమం
- శుభకార్యానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం



బోల్తా పడిన బొలెరో వాహనం



అంబులెన్స్‌లో క్షతగాత్రులు

పాన్‌గల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో బంధువుల వివాహ వేడుకలకు హాజరై స్వగ్రా మానికి తిరిగి వెళ్తుండగా బొలెరో వాహనం బో ల్తాపడి 20 మంది గాయపడ్డారు. ఓ చిన్నారి పరి స్థితి విషమంగా ఉంది. వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండలంలోని తెల్లరాళ్లపల్లి బ్రిడ్జి వద్ద ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు జరిగింది. బంధు వులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండల పరిధిలోని చింతకుంట గ్రామా నికి చెందిన సుధాకర్ కుటుంబ సభ్యులు, పెద్ద కొత్తపల్లి మండలం దేవుని తిరుమలాపురం గ్రా మానికి చెందిన వారి బంధువులు అందరూ కలి సి శుక్రవారం బొలెరో వాహనంలో యాదగిరి గుట్టలో జరిగిన వివాహ వేడుకలకు వెళ్లారు. వే డుకలు పూర్తయ్యాక శనివారం రాత్రి సమయా నికి దేవుని తిరుమలాపురం గ్రామానికి చేరుకుని రాత్రి అక్కడే నిద్రపోయారు. తెల్లవారుజామున చింతకుంటకు బయలుదేరారు. తెల్లవారు జాము న 4 గంటల సమయంలో వారు వస్తున్న వాహ నం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో 15 మంది పెద్దలు, 5గురు చిన్నారులు గాయపడ్డారు. క్షత గాత్రులను వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించా రు. సాత్విక అనే రెండేళ్ల చిన్నారి తలకు బలమైన గాయం కావడంతో కర్నూల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

జోగుళాంబ ఆలయంలో భక్తుల రద్దీ



జోగుళాంబ ఆలయంలో దర్శనం కోసం క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అలంపూర్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): జోగుళాం బ ఆలయాల్లో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం ఉదయం నుంచే భక్తుల రద్దీ నెలకొంది. స్వామి, అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచే పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు పుష్కర ఘాట్ వద్ద నదిలో స్నానాలు ఆచరించి నదిలో కార్తీ క దీపాలను వదిలారు. అనంతరం స్వామికి అభి షేకం, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆల యాల ఎదుట దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

హాస్టల్ విద్యార్థుల వనభోజనం

నాగర్‌కర్నూల్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు ఆదివా రం వనభోజన మహోత్సవం నిర్వహించారు. పట్టణంలోని ఎస్సీ ఏ, బీ, సీ, డీ హాస్టళ్ల విద్యార్థుల స్థానిక బాలికల జూ నియర్ కళాశాల ఆవరణలో చెట్ల కిందకు చేరి పాటలు, క్విజ్ పోటీలు నిర్వహించుకున్నారు. అనంతరం సామూహి క వనభోజనం చేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్, రవితేజ, సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర షెడ్యూల్డు కులాల సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు విద్యార్థుల్లో సహ చర్యం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందిం చేందుకు ప్రతీఏటా వనభోజన మహోత్సవం నిర్వహిస్తా మని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డెన్లు ఆఫీస్ సిబ్బం ది తిరుపతయ్య, బాలస్వామి పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో వనభోజనం చేస్తున్న సాంఘిక సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు

స్వల్పంగా కొనసాగుతున్న

జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 7వేల క్యూసెక్కుల వరద మా త్రమే వస్తున్న కారణంగా ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తిని నిలిపివేసినట్లు ప్రాజెక్ట్ ఎస్పీ శ్రీధర్ తెలిపారు. అర్ధరాత్రి వరకు వచ్చిన వరద కారణంగా ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో 0.7 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి మాత్రమే చేపట్టినట్లు తెలిపారు. అలాగే ఇప్పటి వరకు ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో 1000 మిలియన్ యూ నిట్ల ఉత్పతి చేపట్టినట్లు తెలిపారు. ఎగువ, దిగువ ప్రాజెక్టుల చరిత్రలోనే ఇదే అత్యుత్తమ ఉత్పత్తి అని తెలియజేశారు.

మైసమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో పూజలు

పెద్దకొత్తపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరి ధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తుల కొంగు బంగా రంగా వెలసిన మైసమ్మ తల్లికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ ఆదివారం మహబూబ్‌నగర్, గద్వాల, వన పర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల నలుమూలల నుంచే కాకుండా తె లంగాణ రాష్ట్రంలోనే వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 10వేల మంది భక్తులు మైసమ్మ తల్లిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూ జలు నిర్వహించారు. భక్తుల నుంచి టికెట్ల ద్వారా 70,825 రూ పాయలు, హుండీ ద్వారా 65,534 రూపా యలు మొత్తం ఒక లక్ష 36వేల 359రూపాయల ఆదాయం వచ్చినట్లు చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ఈవో రామశ్వర్‌శర్మలు తెలిపారు.

మత్స్యకారుల వలకు భారీ చేప



మల్లేశ్వరం వద్ద కృష్ణానదిలో వలకు చిక్కిన చేపను చూపిస్తున్న మత్స్యకారుడు అశోక్

పెంట్లవెల్లి నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మం డలం మల్లేశ్వరం గ్రామం సమీపాన కృష్ణా నదిలో ఆదివారం మత్స్యకారుల వలకు భారీ చేప చిక్కింది. ఉదయం చేపల వేటకు వెళ్లిన చాకలి రామ కృష్ణ, పసునూరి అశోక్‌లకు 20కిలో బొచ్చ రకం చేప వలలో పడడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా నదిలో అప్పుడప్పుడు భారీ చేపలు పడుతున్నాయని వారు పేర్కొన్నారు.

తల్లిదండ్రులకు పాదుక పూజ

కందనూలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీసత్య సాయి సేవాసమితి నాగర్‌కర్నూల్ వారి అనుబంధ కార్యక్రమం లో భాగంగా శ్రీపురంలో గ్రామోత్సవ కార్యక్రమం నిర్వహించా రు. ఆదివారం ఉప్పల తిరుపతయ్య, పుష్ప దంపతులచే సత్య సాయి వ్రతాన్ని స్వామి వారి భక్తులచే శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. శ్రీపురంలోని బాలవికాస్ విద్యార్థులచే 11మంది తల్లి దండ్రులకు పాదుక పూజను వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. శ్రీపురం గ్రామపంచాయతీ పరిధిలో పని చేస్తు న్న కార్మికులను, ఆశా వర్కర్లను, సత్యసాయి సభ్యులను శాలు వాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ హకీం విశ్వప్రసాద్, శ్రీసాయి ప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్టు ప్రధాన కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య, మహిళా కన్వీనర్ మిడిదొడ్డి సువర్ణ, యువత కన్వీనర్ గంధం భాస్కర్, గ్రామస్థులు, భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సా..గుతున్న నిర్మాణ పనులు


వనపర్తిలో సురవరం ప్రతాపరెడ్డి స్మారక జిల్లా గ్రంథాలయం భవనం ఇలా..

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సురవరం ప్రతాపరెడ్డి స్మారక జిల్లా గ్రంథాలయం భవనం మొదటి అంతస్తు నిర్మాణ పనులు ఏడాదైనా పూర్తి కావట్లేదు. పనులు ఇంకా నత్తనడకన కొనసాగుతున్నాయి. సుమారు కోటి రూపాయలకు పైగా వ్యయంతో నిర్మించిన గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణానికి 2023 సెప్టెంబర్ మాసంలో అప్పటి మంత్రి కల్వకుంట్ల తారకరామారావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఆ వెంటనే గ్రంథాలయాన్ని పాఠకుల కోసం వినియోగంలోకి తెచ్చారు. ఆ తరువాత మరో రూ.కోటి నిధులతో మొదటి అంతస్తు నిర్మాణాన్ని ఏడాది క్రితం ప్రారంభించారు. ఏడాది గడుస్తున్నా నిర్మాణ పనులు పూర్తి కావట్లేదు. దీంతో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న స్థలం ప్రస్తుతం నిరుద్యోగులకే సరిపోతుంది. వాటర్ ప్లాంట్ లేక అప్పుడప్పుడు తాగునీటికి కూడా ఇబ్బంది కలుగుతున్నట్లు పాఠకులు చెబుతున్నారు.

పాఠకులకు అన్నీ వసతులు కల్పిస్తున్నాం



జిల్లా గ్రంథాలయంలో పాఠకులకు అన్నీ వసతులు కల్పిస్తున్నాం. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఏర్పడ్డ తర్వాత నిరుద్యోగులకు ఉద్యోగాల భర్తీ పెద్దమొత్తంలో జరిగింది. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారికి సరిపడా పోటీ పరీక్షల పుస్తకాలు ఉంచాం. కంప్యూటర్, వైఫై కూడా అందుబాటులో ఉంచాం. దీంతో నిత్యం ఎంతో మంది పోటీపరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు వచ్చి చదువుకొని ఉద్యోగాలు పొందారు. అంతేకాకుండా పాఠకులకు అవసరమైన అన్ని పుస్తకాలు, న్యూస్ పేపర్, మ్యాగ్జిన్స్ అందుబాటులో ఉంచుతున్నాం. వారికి మంచినీరు, తదితర సౌకర్యాలు కూడా అందుబాటులో పెట్టాం. గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 20 వరకు నిర్వహిస్తున్నాం.

- మల్లు నర్సింహారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మహబూబ్‌నగర్

నిరుపేదలకు లైబ్రరీ ఓ వరం



నిరుపేద కుటుంబాల వారికి చదువుకునేందుకు లైబ్రరీ ఓ వరంలాంటిది. లైబ్రరీలో నిరంతరాయంగా పోటీ పరీక్షల పుస్తకాలు చదివి తాను 2024 డీఎస్సీలో ఎస్‌జీటీగా ఉద్యోగం పొంది మాగనూర్ మండలం గురులింగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

- వినోద్, నారాయణపేట

గాడితప్పిన గ్రంథాలయాలు

- పాఠకులకు తప్పని పాట్లు
- పలుచోట్ల నిధుల కొరతతో నిలిచిన భవనం పనులు
- చాలీచాలని ఫర్నిచర్
- పుస్తకాలు, సిబ్బంది కొరత
- గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనం..

గ్రంథాలయాలు పాఠకుల మేథస్సును పెంచడంతో పాటు వారి జీవిత లక్ష్యాలకు పునాదులుగా నిలిచే దేవాలయాలు. ఇందులో పాఠకులుగా ఉన్న వారు వారి మేథస్సుకు పదును పెట్టుకొని వారి జీవిత లక్ష్యాలను నెరవేర్చుకొని ఇప్పుడు ఉన్నతంగా ఉన్నారు. కానీ రానురాను గ్రంథాలయాల నిర్వహణ అధ్వానంగా తయావుతోంది. పాఠకుల సంఖ్య తగ్గిపోతూ వస్తున్నది. గ్రంథాలయాల పాలక వర్గాలు పట్టించుకోకపోవడం, లైబ్రేరియన్లు సరైన నిర్వహణ చేయకపోవడం వంటి కారణంగా సమస్యలు పేరుకు పోతున్నాయి. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల నుంచే వచ్చే సెస్సును సరైన పద్ధతిలో వినియోగించుకోకపోవడం వలన నిర్వహణ అధ్వానంగా తయారయ్యింది. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని గ్రంథాలయాల పరిస్థితి కాస్త మెరుగ్గా ఉండగా, మిగతా నాలుగు జిల్లాల్లో పలు సమస్యలతో కునారిల్లుతున్న వాటిపై ప్రత్యేక కథనాలు...


గద్వాల గ్రంథాలయంలో చదువుకుంటున్న పాఠకులు(ఫైల్)

చైర్మన్, సిబ్బంది మధ్య సమన్వయం కరువు

గద్వాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో 13 గ్రంథాలయాలు ఉండగా అందులో 8 శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. అన్నిటికి మూలం అయినా జిల్లా గ్రంథాలయ నిర్వహణే సక్రమంగా లేనప్పుడు మిగిలిన వాటి పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. చైర్మన్, సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడం, సెస్సులు సక్రమంగా వసూలు కాకపోవడం వంటి వాటితో పాటు చైర్మన్‌తో ఉన్న విబేధాల కారణంగా నియోజకవర్గం పాలకులు దూరంగా ఉండటం వంటివి గ్రంథాలయాల అభివృద్ధికి అవరోధంగా ఉన్నది. అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలు, కంటెంట్ పుస్తకాలు, కెరీర్ గైడెన్స్, రెఫరెన్స్ పుస్తకాలు, బ్యాంకింగ్, రైల్వే, పబ్లిక్ సర్వీస్ కమిషన్ పుస్తకాలు వంటివి శాఖా గ్రంథాలయాలలో అందుబాటులో లేకపోవడంతో అవి నిరాదరణకు గురవుతున్నాయి. అలంపూర్, గట్టు, ధరూర్ మండల కేంద్రాల్లో మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలినచోట్ల ప్రభుత్వ శాఖలకు చెందిన చిన్నచిన్న గదులలో తాత్కాలికంగా నడుస్తున్నాయి.

జిల్లా కేంద్రంలో కూడా ఇరిగేషన్ శాఖకు చెందిన షెడ్డులో నడుస్తున్నది. రెండేళ్ల క్రితం రూ.1.65 కోట్లతో నూతన భవన నిర్మాణం చేపట్టినా నిధులు విడుదలకాక మధ్యలోనే నిలిచిపోయింది. ఇక సిబ్బంది విషయానికి వస్తే ముగ్గురు మాత్రమే రెగ్యులర్ లైబ్రేరియన్‌లు ఉన్నారు.

కళ తప్పిన వారోత్సవాలు

గ్రంథాలయ వారోత్సవాలు గద్వాలలో కళ తప్పాయి. చైర్మన్, సిబ్బంది మొక్కుబడిగా వాటిని నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యేలు కూడా దూరంగా ఉండటంతో ఉన్నతాధికారులు కూడా పట్టిపట్టనట్లు ఉన్నారు.

ఇరుకు గదిలోనే...

నారాయణపేట, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయం దగ్గరున్న గ్రంథాలయం అరకొర వసతులతో ఇరుకు గదిలోనే కొనసాగుతూ పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. 1964లోనే ఏర్పడ్డ గ్రంథాలయం కొత్త జిల్లా ఏర్పాటుతో జిల్లా గ్రంథాలయంగా గ్రేడ్-2గా మారినా పోస్టులు మంజూరు లేక ఒక లైబ్రేరియన్‌తో ముందుకు సాగుతోంది. గ్రేట్-2 లైబ్రేరియన్ పోస్టు, అటెండర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. అయితే నారాయణపేట పట్టణ శివారులోని ఎర్రగుట్ట దగ్గర మునిసిపాలిటీ నుంచి రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన జిల్లా గ్రంథాలయం నిర్మాణం పనులను 80శాతం పూర్తయినా నిధుల కొరతతో 20 శాతం పనులు చేపట్టక నేటికీ అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ప్రభుత్వం అసంపూర్తి జిల్లా గ్రంథాలయం పూర్తికి నిధులు కేటాయించేలా సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు. నారాయణపేటలో సహాయ గ్రంథ పాఠకురాలు శిల్ప ఒక్కరే నెట్టుకొస్తున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.


పేటలో అసంపూర్తిగా జిల్లా గ్రంథాలయ భవనం


నాగర్‌కర్నూల్ జిల్లా గ్రంథాలయంలో బల్లలు లేక కుర్చీలపై పుస్తకాలు ఉంచి చదువుకుంటున్న పాఠకులు

అరకొర వసతులతో..

నాగర్‌కర్నూల్ టౌన్, (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. సొంత భవనం అందుబాటులోకి వచ్చినా, అందులో అరకొర పుస్తకాలు, చాలీ చాలని ఫర్నీచర్, సిబ్బంది కొరతతో పాఠకులకు పూర్తి స్థాయిలో సేవలు అందించలేకపోతోంది. ఇటీవలే ఆధునిక హంగులతో నూతన భవనం నిర్మించినా గ్రంథాలయం నిర్వహణ మాత్రం పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. భవనం విశాలంగా ఉన్నా లోపల కనీస సౌకర్యాలు లేక పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాల సంఖ్య పాఠకుల అవసరాలకు చాలడం లేదు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు చదివే అభ్యర్థుల కోసం కొత్త ఎడిషన్లు, సమకాలీన పుస్తకాలు అందుబాటులో లేవు. ముఖ్యంగా గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్యకు అనుగుణంగా ఫర్నిచర్ లేదు. పాతబడి, విరిగిపోయిన కుర్చీలు, బల్లలతోనే నెట్టుకొస్తున్నారు. ఎక్కువ మంది పాఠకులు వచ్చినప్పుడు కూర్చోవడానికి అవసరమై కుర్చీలు టేబుల్స్ లేవు. దీంతో పోటీ పరీక్షలకు చదివే అభ్యర్థులు, పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు, లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ వినియోగంలో లేకుండాపోయింది. జిల్లా గ్రంథాలయంలో ప్రస్తుతం పూర్తిస్థాయిలో లైబ్రేరియన్ పోస్టు ఖాళీగా ఉంది.

విజ్ఞానం వికసించేలా..


రాంమందిర్ చౌరస్తాలోని గ్రంథాలయం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాలు విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు, చిన్నారులకు వృద్ధులకు పోటీ పరీక్షలకు, సిద్ధం అయ్యే వారికి, పరిశోధనలకు అవసరం అయ్యే రెఫరెన్స్ గ్రంథాలు అందుబాటులో పుస్తకాలు ఉంచడంతో పాఠకులతో గ్రంథాలయాలు కళకళలాడుతున్నాయి. జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డలో గల ప్రధాన గ్రంథాలయం, రాంమందిర్ చౌరస్తాలో ఉన్న గ్రంథాలయం పాఠకులు ఎంతో ఉపయోగపడుతున్నారు. పాఠకులకు అందుబాటులో ఉండే విధంగా తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషకులకు సంబంధించిన దినపత్రికలు, వివిధ వార పత్రికలు, పక్ష, మాస ప్రతికలు అందుబాటులో ఉంచారు. చారిత్రక , భౌగోళిక, రాజకీయ, సామాజిక, విజ్ఞాన, వైద్య, ఆరోగ్య, సాంస్కృతిక, సాహిత్య, కళారంగాలకు సంబంధించిన ఎన్నో పుస్తకాలు జిల్లా గ్రంథాలయంలో ఉన్నాయి. పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యే నిరుద్యోగులకు అవసరం అయినా తెలంగాణ, భారతదేశం, ప్రపంచ దేశాల చరిత్ర, స్వాతంత్ర్యోదమం, ప్రపంచ యుద్ధాలు, వివిధ సామాజిక రాజకీయ ఉద్యమాలు క్రీడలు, ఆధునిక సాహిత్యం మొదలైన పుస్తకాలు సుమారు 56 వేలకు పైగా గ్రంథాలయంలో ఉన్నాయి. నిత్యం పాఠకులతో కళకళాడుతుంది.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 1959 జూలైలో జిల్లా కేంద్ర గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ఇక్కడ జిల్లా కేంద్ర గ్రంథాలయం మెట్టుగడ్డలో కొనసాగుతుండగా, ప్రత్యేక పిల్లల కోసం పాత గ్రంథాలయాన్ని నూతన హంగులతో నిర్మించి రాంమందిర్ చౌరస్తాలో పిల్లల గ్రంథాలయం ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 16 శాఖ గ్రంథాలయాలు కొనసాగుతున్నాయి.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో పత్తి, నగదు దగ్ధం



కాలిన నోట్లు, దగ్ధమైన పత్తి

మరికల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూరు గ్రామంలో ఆదివారం కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో రైతు శ్రీనివాస్ ఇంటి ఆవరణలో 30 క్వింటాల్ పత్తి నిల్వ చేసుకున్నారు. ఇంట్లో లక్ష రూపాయల నగదు, దుస్తులు పూగా కాలి దగ్ధమై, బూడిదయ్యింది. గిర్దావర్ సుధాకర్‌రెడ్డి సమాచారం తెలుసుకొని సంఘటన స్థలానికి చేరుకొని దగ్ధమైన పత్తి, నగదును పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదికను సమాచారం అందించారు. రైతు శ్రీనివాస్‌కు దాదాపు మూడు లక్షల యాభై వేల రూపాయల నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


శివ(ఫైల్)

వెల్దండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనుల నిమిత్తం బయటకు వెళ్లిన యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని రాచూరు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన కొంగళ్ల శివ (26) శనివారం వ్యక్తిగత పని నిమిత్తం కల్వకుర్తికి వెళ్లాడు. ఈ క్రమంలో రాత్రి వరకు శివ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది వెతికారు. ఆదివారం ఉదయం ఒంటిపై గాయాలతో శివ వ్యవసాయ పొలంలో మృతి చెంది కనిపించాడు. విషయం తెలుసుకున్న సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ కురుమూర్తి ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. శివ మృతదేహం పొలంలోని విద్యుత్ స్టాటర్ వద్ద ఉండటంతో విద్యుత్ షాక్‌తో చనిపోయాడా, లేక ఎవరైన చంపి ఉంటారా అన్న కోణంలో విచారణ జరిపారు. దర్యాప్తులో భాగంగా క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లను రప్పించారు. అనంతరం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

మక్తల్‌రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని బొందలకుంట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పట్నం యాదయ్య (36) అనే వ్యక్తి కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 14న పని ఉందని ద్విచక్ర వాహనంపై మక్తల్‌పై వచ్చి తిరిగి వెళ్తుండగా గ్రామ శివారులోని దాబా వద్ద ట్రాక్టర్‌ను ఢీ కొట్టడంతో రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపిన వ్యక్తిపై మృతుడి అత్త చంద్రమ్మ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు.

రిజర్వాయర్‌లో గుర్తు తెలియని మృతదేహం

గద్వాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) గద్వాల మండల పరిధిలోని జములమ్మ రిజర్వాయర్‌లో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యం అయ్యింది. దాదాపు 30నుంచి 35ఏళ్ల వయస్సు ఉన్న పురుషుడు, నాలుగు నుంచి ఐదు రోజుల క్రితం చనిపోయి ఉండటంతో గుర్తు పట్టని విధంగా మృతదేహం ఉందని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఎల్లో కలర్ టీ షర్ట్ ధరించి ఉన్నాడని, దానిపై మాంటిస్సోరి అని రాసి ఉందని తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచామని, అతనికి సంబంధించిన వారు రూరల్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

చిరుత దాడిలో ఆవుదూడ..

కోయిలకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలోని ఎల్లారెడ్డిపల్లిలోని నర్సయ్యకు చెందిన ఆవుదూడపై చిరుత దాడి చేసిందని రైతు తెలిపారు. శనివారం రాత్రి పొలం దగ్గర ఆవులను పాకలో కట్టేసి ఉండగా చిరుత ఓ ఆవుదూడపై దాడి చేసి కొంత దూరం వరకు తీసుకెళ్లినట్లు తెలిపారు. చిరుత దాడిలో ఆవుదూడ మృతి చెందినట్లు వెల్లడించారు.

వ్యవసాయ మోటార్లు దొంగిలిస్తూ...

కృష్ణ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మోటార్లు దొంగిలిస్తూ మోటార్ మెకానిక్, అతని దగ్గ పని చేస్తున్న యువకులను గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మక్తల్ నియోజకవర్గం మండలం గుడిగండ్ల గ్రామానికి చెందిన మోటార్ మెకానిక్ విజయ్ కుమార్ భైరోడ్డులో మోటార్ మెకానిక్ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శనివారం రాత్రి తన కింద పని చేస్తున్న ఇద్దరు పిల్లలను వెంట బెట్టుకుని మారుతి సుజుకి కారులో కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా దేవసూగూరు గంజళ్లి గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద మోటార్లు దొంగతనం చేస్తుండగా గ్రామస్థులు పట్టుకున్నారు. స్థానిక గ్రామస్థులు చితకబాది పోలీసులకు అప్పగించినట్లు గంజళ్లి గ్రామస్థులు ఆదివారం తెలిపారు.

బైకు తగిలి బాలుడికి గాయాలు

వీపనగండ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బైకు తగిలి బాలుడికి గాయాలైన సంఘటన వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల పరిధిలోని కల్వ రాల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కొల్లాపూర్ గ్రామానికి చెందిన స్వర్ణలత తన కుమారుడు ప్రమోద్‌కుమార్ (5)తో కలిసి బైక్‌పై కల్వరాల గ్రామానికి బంధువుల పెళ్లికి వచ్చారు. తిరిగి కొల్లాపూర్ వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా మల్లెపోగు బాలరాజు అతివేగంగా వచ్చి బైకుకు తగిలించాడు. ఈ సంఘటన కుడి కాలుకు బలమైన గాయాలయ్యాయి. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాణి తెలిపారు.

మీకందరికీ అండగా నేనుంటా..

- చేయూత అనాథాశ్రమానికి రూ.6 లక్షల విలువగల వాహనం వితరణ
- ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మీకందరికీ అండగా నేనుంటానని చేయూత అనాథ ఆశ్రమ విద్యార్థులకు భరోసానిచ్చారు. ఆదివారం వనపర్తి మండల పరిధిలోనే చిట్యాల చేయుత అనాథాశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తన తల్లిదండ్రులు సాయి రెడ్డి, వెంకటమ్మ జ్ఞాపకార్థంతో రూ.6 లక్షల విలువగల వాహనాన్ని గిఫ్ట్‌గా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని అనాథ వృద్ధులకు భోజనాన్ని అందించేందుకు ఈ వాహనాన్ని ఉపయోగించినట్లు నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వనపర్తి మండల మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మైనార్టీ నాయకుడు రహీం, చిన్నమందడి మాజీ సర్పంచ్ సూర్య చంద్రారెడ్డి, అంకుర్ వెంకటరెడ్డి, ఆర్యభవన్ శ్రీనివాస్, వనపర్తి జిల్లా ఆయూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వారికి ఆదిత్య కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్, లక్కాకుల సతీష్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


వాహనాన్ని గిఫ్ట్‌గా అందజేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెళ్లికి హాజరు...

వనపర్తి మండలం చిట్యాల గ్రామ శివారులో చేయూత అనాథాశ్రమంలో ఆదివారం నిర్వహించిన వివాహానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. 2004 సంవత్సరం నుంచి ఆశ్రమంలో పెరిగిన మాధవికి నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి దంపతులు జటప్రోలు గోపులాపురం గ్రామానికి చెందిన సందీప్‌రెడ్డితోవివాహం నిర్వహించారు.

ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యం

- త్రుటిలో తప్పిన ప్రమాదం


రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఆత్మకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా డిపోకు చెందిన పల్లె వెలుగు ఆర్టీసీ బస్సుకు ఆత్మకూరు పట్టణ కేంద్రంలో తృటిలో ప్రమాదం తప్పింది. ఆత్మకూరు పట్టణ వాసులు, ప్రయాణికులు తెలిపిన సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు పట్టణ కేంద్రం నుంచి వనపర్తి జిల్లా కేంద్రానికి వెళుతున్న ఆర్టీసీ బస్సుకు ముందు భాగంలోని వీల్స్‌ను కంట్రోల్ చేసే కింగ్ పిన్ ఊడిపోవడంతో బస్సు అదుపుతప్పి ఆత్మకూరు ఎస్‌బీఐ బ్రాంచి ముందు డివైడర్‌ను ఢీకొట్టింది. డ్రైవర్ చాకచక్యంగా ప్రవర్తించడంతో బస్సులో ఉన్న ప్రయాణికులకు ప్రమాదం తప్పిందని పలువురు అంటున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ బస్సును నిలిపివేసి పరిశీలించి ప్రయాణికులను వేరే వాహనంలో వనపర్తి జిల్లా కేంద్రానికి పంపించారు. బస్సుకు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టి వనపర్తి జిల్లా కేంద్రానికి తరలించినట్లు పట్టణవాసులు ప్రయాణికులు తెలిపారు.

హంతకులను శిక్షించాలి

- బంధువుల రాస్తారోకో

కల్వకుర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వెల్దండ మండలం రాచూరు గ్రామానికి చెందిన కొంగళ్ల శివ(26)ను హత్య చేసిన దుండగులను వెంటనే గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేస్తూ బంధువులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు మృతుని బంధువులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని దుండగులను శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి. వెల్దండ ఎస్ఐ కురుమూర్తి ధర్నా చేస్తున్న మృతుడి బంధువులతో మాట్లాడారు.

కొంగళ్ల శివ మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి దోషులను గుర్తించి శిక్ష పడేలా చూస్తామని ఎస్ఐ హామీ ఇచ్చారు. అనంతరం ధర్నా చేస్తున్న మృతుని బంధువులు శాంతించారు.


రాస్తారోకో నిర్వహిస్తున్న మృతుడి బంధువులు

ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిని కలిసిన మత్స్యకారులు


హైదరాబాదులో ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిని కలిసిన మత్స్యకారులు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మండల మత్స్య పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మత్స్యకారులు ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డిని కలిశారు. ఆదివారం హైదరాబాదులోని తన నివాసంలో ఎమ్మెల్యేను కలిసిన మత్స్యకారులు నేడు జిల్లా కేంద్రంలోని కేసరిసముద్రం చెరువులో చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. జిల్లా కేంద్రంలో మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేను కోరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మండల అధ్యక్షుడు గూళ్ల హరికృష్ణ ముదిరాజ్, సభ్యులు తెప్ప రుద్రయ్య, చాపల వెంకటయ్య, బచ్చలి వెంకటయ్య, యాదయ్య, తవిటి నరసింహ, తవిటి నిరంజన్, అంజనేయులు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కురుమూర్తి స్వామి సన్నిధిలో

జపాన్ దేశస్థులు

- ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల హాజరు


స్వామి వారిని దర్శించుకుంటున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు

చిన్నచింతకుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహబూబ్ నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలో వెలసిన కురుమూర్తి వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్వామి వారిని ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు వేరు వేరుగా దర్శించుకున్నారు. అలాగే జపాన్‌కు చెందిన నగోయా అసోసియేషన్ చైర్మన్ కెంజీ ఒకుమురా, సింగిరెడ్డి రవీంద్రరెడ్డి, నరేందర్‌రెడ్డి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి చైర్ పర్సన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి తనయుడు కార్తీక్ రెడ్డి దంపతులు, నాయకులు జగదాభి రామ్‌రెడ్డిలు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోస్గి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం మండలంలోని ముశ్రీఫా గ్రామం నుంచి ఎలాంటి అనుమతిలేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పక్కా సమాచారంతో పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

వరి కోతకు యంత్రాల కొరత

▸ పడిగాపులు కాస్తున్న రైతులు

▸ గంటకు రూ.2500 నుంచి రూ.3300 వరకు దండుకుంటున్న యజమానులు



కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

భూత్పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మొన్నటి వరకు రైతులు యూరియా కోసం పడరాని కష్టాలు పడ్డాడు. ఇప్పుడు చేతికొచ్చిన పంటను తీసుకుందామంటే వరి కోత యంత్రాల కొరతతో ఎటు చూసినా రైతులకు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. మండలంలోని 19 గ్రామాల్లో దాదాపు 20,632 ఎకరాల్లో ఈ సారి ఖరీఫ్ పంటగా వరిని రైతులు సాగు చేశారు. అయితే 51,580 టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉన్నట్లుగా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. వరి కోతలు మొదలై దాదాపు 20 రోజులు కావస్తోంది. ఇప్పటి వరకు 30శాతమే వరికోత కోయగా, ఇంకా 70 శాతం పంట కోతకు సిద్ధంగా ఉంది.

మండలంలో 159 వరి కోత యంత్రాలు ఉండగా, ప్రతీ ఊరికి దాదాపు 6 నుంచి 12 వరకు వరి కోత యంత్రాలు పంటను కోస్తున్నాయి. ఇదే అదనుగా భావిస్తున్న యంత్రాల యజమానులు గంటకు రూ.2500 నుంచి రూ.3300 వరకు రైతుల వద్ద వసూలు చేస్తున్నారు. అదే విధంగా బురదగా ఉన్న పొలాల్లో కోయడానికి చైన్ యంత్రాలు అయితే గంటకు రూ.2800 నుంచి రూ.3600 వరకు వసూలు చేస్తున్న ట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజులుగా తిరుతున్నా..



వారం రోజులుగా వరికోత మిషన్ కోసం తిరుగుతున్నాను. మిషన్ రావడం లేదు. చేతికొచ్చిన పంట నేల పాలవుతోందని భయంగా ఉంది. ఇంటియాదులు కష్టపడి పంట సాగుచేసుకున్నాము.

- ఫకీరా, రైతు, ఏవీఆర్ కాలనీ

ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు..



మిషన్లు బురదలో దిగబడుతాయంటూ వరి కోత యంత్రాల యజమానులు ఇష్టారాజ్యంగా రైతుల వద్ద గంటకు లెక్క లేకుండా దండుకుంటున్నారు. లెక్క ప్రకారం గంటకు ఒక రేటుగా నిర్ణయిస్తే బాగుంటుంది.

- బాల్‌రెడ్డి, రైతు, కర్వెన

20 రోజులుగా పడిగాపులు కాస్తున్న..



15 ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. 20 రోజులుగా వరి కోత మిషన్ కోసం పడిగాపులు కాస్తున్నాను. మిషన్ దొరకడం లేదు. చాలా ఇబ్బంది అవుతోంది.

- నారాయణరెడ్డి, రైతు, శేరిపల్లి

ఇంటర్వ్యూ..

శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలి

▸ ఎస్‌ఐ విక్రం



నవాబ్‌పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ విక్రం అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

పోలీస్ స్టేషన్‌కు ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నట్లు ఉన్నాయి?

వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన గ్రామాలు ఉండటంతో నిత్యం ఫిర్యాదులు వస్తున్నమాట వాస్తవమే. అయితే ఎక్కువ మొత్తంలో చిన్న విషయాలే ఉండటంతో కౌన్సెలింగ్ ఇచ్చి పంపిస్తున్నాం.

ఇసుక అక్రమ రవాణాపై చేపట్టిన చర్యలు?

మండలంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. కారుకొండ గేట్, కూచూర్‌గేట్, యన్మనగండ్ల గేట్, అమ్మాపూర్ గేట్, లింగంపల్లి, మరికల్ గ్రామాల్లో పహరా కాస్తున్నాం.

ప్రతీ ఆదివారం ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది? అందుకు చేపట్టిన చర్యలు?

రహదారుల వెంట ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపడంతో సమస్య ఎదురవుతోంది. వ్యాపారస్థులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి, దుకాణ సముదాయాల ఎదుట వాహనాలు నిలుపరాదని హెచ్చరికలు జారీ చేస్తాం.

దొంగతనాల నివారణకు తీసుకుంటున్న చర్యలు?

సీసీ కెమెరాలు లేకపోవడంతో పలు చోట్ల దొంగతనాలు జరుగుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశానుసారం త్వరలో 30 సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

న్యూస్ బాక్స్

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎంప్లాయీస్ కాలనీలోని 7వ నెంబర్ రోడ్‌లో నూతనంగా నిర్మించే శివపార్వతుల ఆలయ నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి భూమిపూజ నిర్వహించారు. స్థల దాత భూపాల్‌రావు, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అంతకుముందు మహబూబ్‌నగర్ రూరల్ మండలానికి చెందిన కడావత్ రాజేశ్వరి చెవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో రూ.25 వేల చెక్కును అందజేసి, మాట్లాడారు. ఆర్థిక వెనుకబాటుతో ఉన్నత విద్యకు దూరం కాకుండా నియోజకవర్గంలో విద్యానిధి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాజేశ్వరి మంచి డాక్టర్‌గా ఎదిగి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. కాంగ్రెస్ నాయకుడు మారేపల్లి సురేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, రాజేశ్వరి తండ్రి కడావత్ వాస్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

కోయిలకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇటీవల దమాయపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వీరన్నపల్లికి చెందిన ముత్యాలమ్మ, బాల్‌రాం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాములు కోరారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.5 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి గోపాల్, జిల్లా కార్యదర్శి బాల్‌రామ్, రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు



సంజీవరాయుని ఆలయం దగ్గర తవ్వి వదిలేసిన దృశ్యం

భూత్పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని 9వ వార్డు 44వ జాతీయ రహదారి (సర్వీసు రోడ్డు) హైదరాబాద్ వెళ్లే రోడ్డు గ్యాస్ పైపులైన్ కోసం 20 రోజుల క్రితం సైడ్ బోర్ లైన్ తీస్తున్న క్రమంలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయింది. స్పందించిన మిషన్ భగీరథ అధికారులు, జాతీయ రహదారి అధికారులు మరమ్మతు చేశారు. కాగా మూడు రోజుల తరువాత మళ్లీ పైపులైన్ లీక్ కావడంతో 15 రోజుల నుంచి సర్వీస్ రోడ్డుపై నీరు వృథాగా పారుతుంది. మునిసిపల్ కమిషనర్ నురూల్ నజీబ్‌ను వివరణ కోరగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడారని, త్వరలో మరమ్మతు చేపట్టనున్నట్లు తెలిపారు.

టెర్రరిస్టులతో చర్చలు.. మావోయిస్టులపై కాల్పులా?

▸ సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



మాట్లాడుతున్న సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

పాలమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : టెర్రరిస్టులతో చర్చలు జరుపుతున్న కేంద్ర దోపిడీ పాలకవర్గాల చేతిలో తరతరాల నుంచి నలిగిపోతున్న పీడిత ప్రజల కోసం సిద్ధాంత ప్రాతిపదికన పనిచేస్తున్న మావోయిస్టులు శాంతిచర్చలకు పిలుపునిచ్చినా పట్టించుకోలేదు. బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో మావోయిస్టులను అంతం చేయటం విషాదకరమని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం సీపీఐ శతవసంతాల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేపట్టిన సీపీఐ బస్సు ప్రచార జాతా జిల్లా కేంద్రానికి చేరుకుంది. ప్రచార జాతాకు సీపీఐ శ్రేణులు బతుకమ్మలు, అరుణ పతాకాలతో స్వాగతం పలికి ఊరేగింపు చేపట్టారు. అనంతరం గడియారం చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. బ్రిటీష్ ముష్కరుల నుంచి స్వాతంత్ర్యం కావాలని సీపీఐ నాయకత్వంలో ఎంతోమంది ప్రాణత్యాగం చేశారన్నారు. బ్రిటీష్ వాళ్లకు ఊడిగం చేసిన చరిత్ర ఆర్ఎస్ఎస్‌కు ఉందన్నారు. మోదీ, అమిత్‌షా కమ్యూనిజాన్ని, లౌకిక సోషలిజ భావజాలాన్ని అంతం చేయలేరన్నారు. 75ఏళ్ల భారతావనిలో నిరుద్యోగం, ఆకలి, పేదరికం, దారిద్ర్యం తొలగిపోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహా, జిల్లా కార్యదర్శి బాలకిషన్, పరమేశ్వర్‌గౌడ్ ప్రసంగించారు.

కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్, పి.సురేష్, డి.రాము, అల్వాల్‌రెడ్డి, కె.పద్మావతి, కె.నరసింహ, భాష, గంటల శ్రీను, రాజు, లక్ష్మణ్, రాజశేఖర్, మహేష్, జగన్, గణేష్, ప్రవీణ్, వెంకన్న, భాస్కర్, జాను, లింగం, దేవానంద్, గోపాల్, అంజి, జగన్, యాదయ్య, మణ్యం, మాదగిరి, ఇందిర, చెన్నమ్మ, శేఖర్, దినకర్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అండర్‌గ్రౌండ్ వంతెన పనులు



జానంపేట వద్ద కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు

మూసాపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలను అరికట్టడంతో పాలు పూర్తిస్థాయిలో వాటి నివారణకు ఎన్‌హెచ్‌ఏఐ హైవే అథారిటీ ఆధ్వర్యంలో అండర్ వంతెన నిర్మాణాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మండలంలోని జాతీయ రహదారి జానంపేట వద్ద పాత పెట్రోల్ పంపు సమీపంలో అండర్ గ్రౌండ్ వంతెన నిర్మాణం మంజూరైంది. దీంతో రెండు నెలలుగా వంతెన నిర్మాణ పనుల కోసం రోడ్డు ఇరువైపులా చదును చేసి డ్రైనేజీతో పాటు సబ్‌రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నారు. జానంపేట గ్రామం మధ్యలో స్టేజీ వద్దనే వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు పట్టుపడినా.. రహదారి విస్తణాధికారుల సూచన ప్రకారం మంజూరు చేసిన చోటనే నిర్మాణం చేపడుతున్నారు. పాత వంతెన పాఠశాల ఎదుట ఉండటంతో కొంత దూరంలో కొత్త వంతెన నిర్మాణం చేపడుతున్నామని అధికారులు తెలిపారు. వేముల స్టేజీ వద్ద అండర్ గ్రౌండ్ వంతెన నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతుండగా, మరికొన్ని నెలల్లోనే పనులు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. సకాలంలో పనులు పూర్తి చేసి ఇబ్బందులు తలెత్తకుండా మండల ప్రజలు కోరుతున్నారు.

వెంటనే అరెస్టు చేయాలి

పాలమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం, ఎల్లంపల్లికి చెందిన దళిత యువకుడు రాజశేఖర్‌ను హత్య చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్మయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. నిందితులను అరెస్టు చేసి శిక్షించే వరకు కేవీపీఎస్ అండగా ఉంటుందన్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న చంద్రశేఖర్, భవానికి రక్షణ కల్పించాలని, హత్యకు గురైన రాజశేఖర్ భార్యకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. భాస్కర్, విజయ్‌కుమార్, యువజన నాయకుడు కృష్ణ పాల్గొన్నారు.

రక్షణ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

▸ పట్టించుకోని అధికారులు



గాజులపేట ప్రాథమిక పాఠశాల సమీపంలో..

మహబూబ్‌నగర్ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల పరిసరాల్లోనే ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడం, దీనికి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. మహబూబ్‌నగర్ రూరల్ మండలం గాజులపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో విద్యార్థులు ఆడుతూ పాడుతూ అటుగా వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా మాచన్‌పల్లి తండాలోనూ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడం, విద్యుత్ తీగలకు చుట్టూ పొదలు అల్లుకున్నాయి. దీంతో ఏమైనా విద్యుత్ సమస్యలు వస్తే మరమ్మతు చేపట్టడానికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.



మాచన్‌పల్లి తండాలో..

బంజారాలు అభివృద్ధి చెందాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత

పాలమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బంజారాలు అభివృద్ధి చెందాలని మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో చలో న్యూఢిల్లీ పోస్టర్ (వన్ బంజారా-వన్ రిజర్వేషన్)ను ఆమె టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్‌రెడ్డి, బెక్కరి మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా గిరిజన సేవా సంఘం నాయకులు శేఖర్, గోవర్ధన్, రాము, రవి, మోహన్, చందర్, పుణ్య పాల్గొన్నారు.

బీటీ ఎప్పుడు వేస్తారు?



కంకర వేసి వదిలేసిన తెలుగుగూడెం గ్రామ రోడ్డు

మహబూబ్‌నగర్ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కంకర వేశారు.. బీటీ వేయడం ఎప్పుడా అని మహబూబ్‌నగర్ రూరల్ మండలం తెలుగు గూడెం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రోడ్డు నుంచి గ్రామానికి కిలో మీటరు ఉంటుంది. నాలుగు నెలలుగా వర్షాల కారణంగా బీటీ వేయకపోవడంతో బైకులపై వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే బీటీ వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రతీ బూతుకు బాధ్యులు తప్పని సరి

మిడ్జిల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎన్నికల సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయని తహసీల్దార్ యాపీ రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు మండలంలోని అన్ని పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని 32 పోలింగ్ స్టేషన్లకు ఒక్కో పార్టీ నుంచి బాధ్యతాయుత బూత్ లెవల్ ఏజెంట్‌ను తప్పనిసరిగా నియమించాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలతో పాటు పలు ఎన్నికల సంఘం ద్వారా గుర్తింపు పొందిన పార్టీల కార్యకర్తలను ప్రతిపాదిత జాబితాల్లో చేర్చి వాటిని సమావేశానికి తీసుకరావాలని ఆదేశించారు. ఎన్నికల వాదనలు, అభ్యంతరాలు, సారాంశ సవరణలపై చర్చించేందుకు నిర్వహిస్తున్న సమావేశంలో ప్రతిపాదిత ఏజెంట్ల జాబితాలను తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

పాలమూరులో అయ్యప్ప నామస్మరణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వాడవాడలో అయ్యప్ప నామస్మరణతో మార్మోగుతుంది. అయ్యప్ప కొండపై స్వాములు ప్రభాత వేళలో అయ్యప్ప పూజలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం అశోక్ టాకీస్ చౌరస్తాలోని అఖిల భారత అయ్యప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో స్వాములకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి ఈ అల్పాహార కేంద్రాన్ని స్వాములు పడిపూజ నిర్వహించి ప్రారంభించారు. శశిధర్ రెడ్డి గురుస్వామి, రఘునాథ్ గురుస్వామి, గుండా మనోహర్, నారాయణ, వేణుగోపాల్, అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్ పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం అమలు చేయాలి



న్యాయసాధన దీక్ష చేపట్టిన బీసీలు

పాలమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు ఇచ్చే రిజర్వేషన్లు భిక్ష కాదు - ముమ్మాటికీ హక్కు అని బీసీ జేఏసీ కో-చైర్మన్ మున్నూరు రాజు అన్నారు. సమాజంలో అధిక శాతం ఉన్న బీసీలకు 42శాతం రిజర్వేషన్ ధర్మ బద్ధంగా, న్యాయ బద్ధంగా ఇవ్వమని అడగటం వందశాతం న్యాయమైంది. ఆదివారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో 'బీసీ న్యాయ సాధన దీక్ష' చేపట్టారు. ముఖ్యమంత్రి అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధానితో మాట్లాడి 42శాతం రిజర్వేషన్‌పై చర్చించే ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వెంకటేష్, గోనెల శ్రీనివాస్, రాములు, విజయ్ కుమార్, కోరమోని వెంకటయ్య, కొండా బాలయ్య, సుధాకర్, నరసింహ, గణేష్, శాంతయ్య, యాదయ్య పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మవిశ్వాసం పెంపు



బెల్టులు సాధించిన విద్యార్థులతో జి.కృష్ణయ్య

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కరాటే, మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మ విశ్వాసం పెంపొందుతుందని జీకే మాస్టర్ షోటోకాన్ దు ఇండియా చీఫ్ కృష్ణయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ డైట్ కళాశాల ఆవరణలో ఆదివారం విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించగా, జీకే మాస్టర్స్ షోటోకాన్ కరాటే దూ ఫౌండర్, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డైరెక్టర్ కృష్ణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేశారు. షోటోకాన్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పతకాలు సాధించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో యాదయ్య, కరాటే మాస్టర్లు శివకుమార్, దామోదర్, పవన్, మహిమాన్వి, వర్ష తదితరులు పాల్గొన్నారు.

కృతజ్ఞతా భావం కలిగి ఉండాలి



ప్రార్థనలు చేస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మనకు అన్ని సమకూర్చే దేవుడు ఆయన పట్ల కృతజ్ఞత కలిగిన వారినే అమితంగా ఇష్టపడతాడని పాస్టర్ రెవరెండ్ వరప్రసాద్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ ఆసుపత్రి ఎదుట ఉన్న రేమో వర్షిప్ సెంటర్లో పాస్టర్ పరంజ్యోతి అధ్యక్షతన నిర్వహించిన కృతజ్ఞత అర్పణ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వం సమకూర్చే దేవుడికి మనం తిరిగి ఏమి చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కేవలం కృతజ్ఞతలు కలిగి ఉంటే చాలన్నారు. కృతజ్ఞతలు లేని వారని దేవుడు ఇష్టపడడన్నారు. ఏటా నవంబరులో కృతజ్ఞతార్పణల పండుగలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా విశ్వాసులు తీసుకొచ్చిన తినుబండరాలను శ్యాంసుందర్ అధ్యక్షతన వేలం నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు తిమోతి, వేదాంతి, నాగారాజు, షద్రక్, మోహన్, దేవయ్య, రాజు, మహేందర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిన్నింగ్ మిల్లుల యాజమాన్యం సమ్మె

పాలమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిన్నింగ్ మిల్లుల జిల్లాలోని ప్రైవేటు యాజమాన్యం సోమవారం సమ్మెలోకి వెళ్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో ప్రకటించింది. మహబూబ్‌నగర్ ఓబ్లాయపల్లి, జడ్చర్ల పరిధిలోని రాణిపేట, కౌరంపేట, జడ్చర్ల పట్టణంలోని జిన్నింగ్ మిల్లులు సమ్మెలో ఉండనున్నాయి. సీసీఐ అధికారులు జిన్నింగ్ మిల్లుల కేటాయింపులో ఎల్1, ఎల్2 పద్ధతిని అనుసరించడంతో అందుకు వ్యతిరేకంగా జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపడుతున్నట్లు వెల్లడించింది. పత్తి రైతులు ఇది గమనించి సమస్య పరిష్కారం అయ్యే వరకు పత్తిని జిన్నింగ్ మిల్లులకు తీసుకురాకూడదని వివరించారు. ప్రభుత్వం స్లాట్ బుకింగ్ తీసివేయాలని డిమాండ్ చేశారు. ఏరోజు వచ్చిన పత్తి రైతు అదే రోజు అమ్ముకుని వెళ్లటానికి సౌకర్యం కల్పించాలన్నారు. రైతుల అందరి దగ్గర స్మార్ట్ ఫోన్‌లు లేవు కాబట్టి స్లాట్ బుకింగ్ తీసివేసి, రైతులు స్వేచ్ఛగా అమ్ముకుని పోవటానికి అవకాశం ఉండాలనే డిమాండ్‌తో సమ్మె చేపడుతున్నట్లు ప్రకటించారు.

కరాటే టోర్నీలో విద్యార్థుల ప్రతిభ



జాతీయ స్థాయి కరాటే పతకాలు సాధించిన కింగ్‌షోటోకాన్ విద్యార్థులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ప్రెసిడెంట్ కప్ ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన కింగ్ షోటోకాన్ విద్యార్థులు సాబేర్, హప్స బేగం, ఆయేషా, జుల్ఫికర్, మహ్మద్‌ఖాసీం, బిలాల్, అబుబకర్, అజీజ్, ఖాజా పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వీరిని కింగ్‌షోటోకాన్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ అభినందించారు.

మొక్కజొన్న క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,034



మార్కెట్‌కు వచ్చిన మొక్కజొన్న

నవాబ్‌పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బాలాజీ మార్కెట్ యార్డుకు ఆదివారం మొక్కజొన్న భారీగా తరలివచ్చింది. 14,485 బస్తాలు (7,243 క్వింటాళ్లు) రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,034, కనిష్ఠంగా రూ.1,501 పలికినట్లు మార్కెట్ కార్యదర్శి రమేష్ ఆదివారం తెలిపారు. హంస 567 బస్తాలు రాగా, (227 క్వింటాళ్లు) క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,930, కనిష్ఠంగా రూ.1,779 పలికింది. ఆర్ఎన్ఆర్ 1648 బస్తాలు (659 క్వింటాళ్లు) రాగా, గరిష్ఠంగా రూ.2552 పలికింది.

భక్తిభావం పెంపొందేందుకే గీతా పోటీలు



బహుమతి ప్రదానం చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో భక్తి భావం పెంపొందించేందుకే గీతా పోటీలు నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ పాలమూరు నగర అధ్యక్షుడు విఘ్నేష్ అన్నారు. గీతా జయంతిని పురస్కరించుకుని విశ్వ హిందూ పరిషత్ పాలమూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఆ శాఖ కార్యాలయంలో విద్యార్థులకు నాలుగు స్థాయిలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా, గెలుపొందిన వారికి ఈనెల 22న శివశక్తినగర్‌లోని కార్యాలయంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కన్వీనర్ గోవింద్‌రెడ్డి, హన్మంతు, శ్రీశైలం, నిరంజన్ పాల్గొన్నారు.